

## కేటీఆర్‌కు హిమాన్షు స్పెషల్ గిఫ్ట్

- యానిమల్ సినిమాలోని 'నాన్న' పాట పాడిన హిమాన్షు
- కష్టతరమైన ఏడాదిలో ఉత్తమ బహుమతని కేటీఆర్ కితాబు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆయన కుమారుడు హిమాన్షు స్పెషల్ గిఫ్ట్ ఇచ్చారు. యానిమల్ సినిమాలోని 'నాన్న' పేరిట ఉన్న 'నా సూర్యుడివో... నా చంద్రుడివో..' పాటను సొంత గాత్రంతో ఆలపించారు. ఈ పాటను కేటీఆర్ ఎక్స్ ఖాతాలో శనివారం పోస్టు చేశారు. కేటీఆర్, హిమాన్షు తీపి గుర్తులకు సంబంధించిన ఫొటోలతో ఓ వీడియో రూపొందించి పాటను జోడించారు. యానిమల్ సినిమాలోని ఒరిజినల్ పాటకు ఏ మాత్రం తగ్గకుండా హిమాన్షు గాత్రం కుదిరింది. హిమాన్షు ఈ పాటను జూలైలోనే తన పుట్టిన రోజు సందర్భంగా రికార్డు చేసి ఉంటాడని కేటీఆర్ అన్నారు. కానీ అప్పుడున్న పరిస్థితుల వల్ల హిమాన్షు ఆ పాటను బయటకు విడుదల చేయలేదేమోనని అభిప్రాయపడ్డారు. 'వారం క్రితమే మొదటిసారి ఈ పాటను విన్నాను. ఈ కష్టతరమైన సంవత్సరంలో నాకు ఉత్తమమైన బహుమతి. థ్యాం క్యూ బింకు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు. హిమాన్షుకు తండ్రిగా గర్వపడుతున్నానని చెప్పారు. ఈ పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'గుడ్ సన్.. గుడ్ ఫాదర్' అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. తండ్రికి తగ్గ తనయుడు అని హిమాన్షును పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఒరిజినల్ పాటకు ఏమాత్రం తగ్గలేదని ట్వీట్లు చేస్తున్నారు.

**శభాష్.. హిమాన్షు: ఎంపీ వద్దిరాజు**

కేటీఆర్ కోసం తనయుడు హిమాన్షు పాట పాడి ప్రేమను చాటుకోవడంపై బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అభినందించారు. తండ్రిపై తనకున్న ప్రేమాభిమానాలు, గౌరవాన్ని పాట రూపంలో ఆవిష్కరించడం పట్ల శనివారం ఒక ప్రకటనలో ఆశీస్సులు అందజేశారు.

# 54 కోట్లు 600 కోట్లు ఎట్లయినయి?

- అవినీతి జరిగిందని భావిస్తే ఆ సంస్థపై కేసు ఎందుకు పెట్టలేదు?
- ఎన్నికల సంఘం తరుపున వకాల్తా ఎందుకు పుచ్చుకున్నారు?
- కౌంటర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-రేస్ కేసులో ప్రభుత్వం తనపై చేస్తున్నది ఉద్దేశపూర్వక, నిరాధారమైన నిందారోపణలే తప్ప, నిజాలు ఎంతమాత్రం లేవని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. సర్కార్ మోపిన అబద్ధాలను తాను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని స్పష్టంచేశారు. ఫార్ములా ఈ-రేస్‌పై ప్రభుత్వం చేస్తున్న వాదనను తిరస్కరించారు. ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపై ఆయన హైకోర్టులో కౌంటర్ దాఖలు దాఖలు చేశారు. తనపై సర్కారు చేస్తున్న ఆరోపణల్లో ఎంతమాత్రం నిజంలేదని కౌంటర్‌లో బదులిచ్చారు. ఫార్ములా ఈ-రేస్ సీజన్-10 నిర్వహణకు స్పాన్సర్ లేకపోవడం వల్లే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. 'ఈ మొత్తం వ్యవహారంలో కుట్ర లేదు. అవినీతి అంతా కన్నా లేదు. చట్ట పరిధిలోనే నిర్ణయం తీసుకున్నాను. హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచడం కోసం తీసుకున్న నిర్ణయం మాత్రమే. ఫార్ములా ఈ-రేస్ మరో సీజన్‌ను కూడా హైదరాబాద్‌లో నిర్వహించడానికి తీసుకున్న ఒక విధానపరమైన నిర్ణయం మాత్రమే' అని కేటీఆర్ పేర్కొన్నారు.

**ఈసీ తరుపున వకాల్తా ఎందుకు?**

ఫార్ములా ఈ-రేస్‌కు సంబంధించి ప్రభుత్వం చేస్తున్న వాదన అర్థరహితమని కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించారన్న ప్రభుత్వ వాదనను తీవ్రంగా తప్పుబట్టారు. 'ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన జరిగితే ఎలక్షన్ కమిషన్ నోటీసులు ఇవ్వాలి. అది ఇప్పటివరకు జరగలేదు. ఎలక్షన్ కమిషన్ తరుపున మీరు ఎందుకు వకాల్తా పుచ్చుకున్నారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఫార్ములా ఈ-రేస్ వలన రాష్ట్రానికి రూ.700 కోట్ల ప్రయోజనం చేకూరిందని నీల్సన్ రిపోర్ట్ పేర్కొన్న విషయాన్ని ఉదహరించారు. ఫార్ములా ఈ-రేస్ చేజారిపోకూడదనే ఉద్దేశంతో రూ.54 కోట్ల చెల్లింపులను గతంలో తాను ప్రాతినిధ్యం వహించిన శాఖ చేసిందని వివరించారు. చెల్లింపులు అక్రమం కాదని పునరుద్ఘాటించారు. అయితే, రూ.54 కోట్లు 600 కోట్లు ఎట్లా అయ్యాయి? ఆ లెక్క ఇప్పటివరకు తమకు కనిపించలేదని పేర్కొన్నారు. అది పూర్తిగా నిరాధారమైన ఆరోపణ అని చెప్పారు. ఫార్ములా ఈ-రేస్‌లో మొత్తం రూ.600 కోట్ల అవినీతి జరిగిందంటూ ఊకదంపుడుగా, ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రూ.600 కోట్ల అవినీతి అని తన మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

**ఆ సంస్థ మీద కేసు ఎందుకు వేయలేదు?**

హెచ్ఎండీఏ అధికారాలకు లోబడే రూ.54 కోట్లు చెల్లింపులు ఫార్ములా-ఈ రేస్ నిర్వహణ సంస్థకు బదిలీ జరిగిందని కేటీఆర్ స్పష్టంచేశారు. ప్రభుత్వం చెప్పే రూ.8 కోట్లు ట్యాక్స్ రిటర్న్స్ మాత్రమేనని, స్పాన్సర్ ఆ పన్నును భర్తీ చేస్తారని తెలిపారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ద్వారా చెల్లింపులు అన్నీ నిబంధనల ప్రకారమే జరిగాయని తెలిపారు. 'రూ.54 కోట్లు ఫార్ములా ఈ-రేస్ నిర్వాహకులకు ఇచ్చినప్పుడు, ఒకవేళ మీరన్నట్టు అవినీతి జరిగితే మరి ఫార్ములా ఈ-రేస్ సంస్థ మీద కేసు ఎందుకు వేయలేదు? ఇప్పటివరకు నాకు రూపాయి కూడా ముట్టినట్టు మీరు చూపించలేకపోయారు. ఇవి కక్షపూరిత ఆరోపణలే కానీ నేరం జరిగిందని చెప్పే రుజువులు కాదు. ఫార్ములా ఈ-రేస్ వల్ల ఒకవేళ నష్టం జరిగితే అది కేవలం రేవంత్‌రెడ్డి అర్థరహిత నిర్ణయాలు, అనాలోచిత పనుల వల్ల మాత్రమే జరిగింది' అని కేటీఆర్ దాఖలు చేసిన కౌంటర్‌లో స్పష్టంచేశారు.



## నల్లమలలో కనిపించిన పులి

నల్లమల అభయారణ్యంలో పర్యాటకులకు పెద్దపులి కంటపడింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఫరహాబాద్ టైగర్ సఫారీలో భాగంగా శనివారం ఉదయం నల్లమల అందాలు, వ్యూ పాయింట్ సందర్శనకు వెళ్తుండగా రోడ్డుపై పులి కనబడడంతో అటవీశాఖ సిబ్బంది వాహనాన్ని ఆపారు. పర్యాటకులు ఫోన్లలో పులి ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారు. పులుల సంఖ్య పెరుగుతున్నదని, పర్యాటకులు జాగ్రత్తలు పాటించాలని మన్ననూర్ ఎఫ్ఆర్వో రవికుమార్ సూచించారు. - అమ్రాబాద్

## ఫార్ములా-ఈ కేసు మనీలాండరింగ్ పరిధికి రాదు

- అక్రమ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటాం
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఈడీ పెట్టింది అక్రమ కేసు అని, ఇది మనీ లాండరింగ్ పరిధిలోకి రాదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. ఫార్ములా-ఈ రేస్ విషయంలో ఎలాంటి మనీ లాండరింగ్ జరగలేదని తెలిపారు. కేటీఆర్‌పై కక్షపూరితంగా మనీలాండరింగ్ కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఈ కేసు పీఎంఎల్ఏ చట్టం పరిధిలోకి రాదని, కేటీఆర్‌పై మోపిన అభియోగాలకు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ కేసును బీఆర్ఎస్ పార్టీ న్యాయపరంగా ఎదుర్కొంటుందని స్పష్టంచేశారు.

## వివాహితపై లైంగికదాడి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 28 : నిర్మల్ పట్టణంలో శుక్రవారం రాత్రి ఓ వివాహితపై లైంగికదాడి జరిగినట్టు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. నిర్మల్ బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ రాథోడ్ అనిల్ వద్దకు ఆటోడ్రైవర్ అనిల్ వచ్చి బస్టాండ్ సమీపంలో ఉన్న తన ఆటోలో ఓ మహిళ స్పృహ కోల్పోయి ఉందని సమాచారం ఇచ్చాడు. వెంటనే కానిస్టేబుల్ వెళ్లి ఆమెను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. శనివారం ఆమెకు స్పృహ వచ్చిన తర్వాత వివరాలు తెలిపింది. శుక్రవారం తన భర్తతో గొడవ జరగడంతో నిర్మల్ బస్టాండ్‌కు వచ్చింది. అక్కడ యోగేశ్ అనే వ్యక్తి పరిచయంకాగా పట్టణంలోని ఓ లాడ్జికి వెళ్లారు. అక్కడ యోగేశ్ లైంగికదాడికి పాల్పడినట్టు బాధితురాలు పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనాస్థలిని ఎస్పీ జానకీ షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి పరిశీలించారు.

## కోర్టు ధిక్కరణ కేసులో.. ఎస్సైకి వారం రోజుల జైలు

- పది రోజులపాటు తీర్పు ఉత్తర్వులు నిలిపివేత

తరిగొప్పుల, డిసెంబర్ 28 : కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ఒకరిని అరెస్టు చేసిన కేసులో ఓ ఎస్సైకి వారం రోజుల జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధించి, బాధితుడికి పరిహారంగా రూ.50వేలు ఇవ్వాలని హైకోర్టు తీర్పునిచ్చింది. ఘటనకు సంబంధించిన వివరాలు .. జనగామ జిల్లా తరిగొప్పుల పోలీస్‌స్టేషన్‌లో ధాన్యం అమ్మకాలకు సంబంధించి నమోదైన కేసులో తనను నిందితుడిగా చేర్చడంతో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గొలుసుల నర్సయ్య హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ జరిపిన కోర్టు నోటీసులు జారీచేసి చట్టప్రకారం దర్యాప్తు చేయాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నాలుగు రోజుల తర్వాత నర్సయ్యను అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు పంపారు. నర్సయ్య కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేయగా జస్టిస్ సురేందర్ విచారణ చేపట్టారు. ఎస్సై నరేశ్‌యాదవ్ క్షమాపణను తోసిపుచ్చుతూ వారంరోజుల జైలు శిక్ష విధించారు. ఎస్సైకి అప్పీలుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థించడంతో తీర్పు అమలును 10 రోజులు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఎస్సై వివరాలు వెల్లడించారు.. గతేడాది ఏప్రిల్‌లో తరిగొప్పుల మండలం బొంతగట్టునాగారానికి చెందిన 23 మంది రైతుల వద్ద 100 టన్నుల ధాన్యాన్ని ఏజెంట్ కనకరాజు కొనుగోలు చేశారు. మొత్తం రూ.22.50లక్షలకు గాను రైతులకు రూ.3.50 లక్షలు ఇచ్చారు. రైతులు ఇబ్బందిపెడుతుండడంతో ఏజెంట్ తాను ధాన్యం అమ్మినవారిపై అక్టోబర్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో కరీంనగర్ జిల్లా కన్నాపూర్‌కు చెందిన సాగర్‌ను అరెస్టు చేయగా, వరంగల్ జిల్లా నెక్కొండ రెడ్లవాడ చెందిన గొలుసుల నర్సయ్య పరారీలో ఉన్నాడు. అనంతరం నర్సయ్యను అదుపులోకి తీసుకోగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సీడ్స్ ప్రాసెసింగ్ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా పలు మిల్లులకు విక్రయించినట్టు చెప్పారు. ఆ సొమ్మును రైతులకు ఇవ్వలేదని నర్సయ్య ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అది దృష్టిలో పెట్టుకొని తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, తాను ఎవరికీ అన్యాయం చేయలేదని ఎస్సై స్పష్టం చేశారు.

## కేజీబీవీ అల్పాహారంలో పురుగులు

- దిలావర్‌పూర్‌లో తల్లిదండ్రుల ఆందోళన

దిలావర్‌పూర్ డిసెంబర్ 28 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని కేజీబీవీలో అల్పాహారంలో (దొడ్డు అటుకుల్లో) పురుగులు వచ్చాయని, నాణ్యతలేని భోజనం అందిస్తున్నారని శనివారం ఉదయం విద్యార్థినులు తెలుపడంతో వారి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. భోజనాన్ని తాము పరిశీలిస్తామని తల్లిదండ్రులు కోరగా పాఠశాల సిబ్బంది వారిని లోనికి అనుమతించకపోవడంతో ఆందోళనకు దిగారు. తహసీల్దార్ స్వాతి, ఎంఈవో శంకర్ అక్కడికి చేరుకొని విద్యార్థినులను గేటు వద్దకు తీసుకెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడించారు. ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో కొంత ఇబ్బందులు వచ్చాయని, విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, విద్యాబోధన అందిస్తామని చెప్పడంతో వారు శాంతించారు.


కళ్యాణమస్తు

..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో

రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy, Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O.: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O.: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439



| వధువు కావలెను | వరుడు కావలెను |
| --- | --- |
| ★రెడ్డి: 29 Yrs, 6Ft, MBBS, MS, Doctor, Hyd, 3L PA, 40 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888 | ★ రెడ్డి: 26 Yrs, 5'6", MBBS, MS (OBC & 4YN), Doctor 30 Cr. ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888 |
| ★రెడ్డి:29 Yrs, 5'8", MBBS, PG, Doctor, 25 Cr. Property గల వరుడికి తగిన వధువు కావలెను. 9010051444. | ★రెడ్డి:26 Yrs, 5'2", MBBS, PG, Doctor, 2 LPM, గల Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. 9010051444 |
| ★ రెడ్డి: 32 Yrs, 5'11", MBBS, MD & DM Doctor, 30 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9030315599 | ★రెడ్డి:28 Yrs, 5'8", MBBS., MD & DM, Doctor, 5LM 50 Cr Property గల వధువుకు వరుడు కావలెను. 7207930999 |
| ★కాపు:30 Yrs, 5'9", MBBS, MD, DNB, Asst. Professor, 30 LPA, 20 Cr. Property గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229 | ★కమ్మ:31 Yrs, 5'6", MBBS, MD, Radio oncology, Doctor 6Cr Propery గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777 |
| ★మున్నూరుకాపు: 29 Yrs, 5'9", MBBS, MS (General Surgen) 40 Cr Property గల వరుడికి తగిన వధువు కావలెను. 7207930999 | ★కాపు: 26 Yrs, 5'4", MBBS, PG (Gynic), Doctor, గల well Settled వధువుకు తగిన వరుడు కావలెను. 9701960229 |
| ★పద్మశాలి: 33 Yrs, 5'6" MBBS, PG, Central Govt Doctor, గల వరుడికి తగిన వధువు కావలెను. 9248064777 | ★మున్నూరు కాపు:28 Yrs, 5'4", MBBS, MD, Doctor, గల వధువుకు వరుడు కావలెను. 9030315599 |
| ★ముదిరాజ్: 31 Yrs, 5'9", MBBS, MS (General Surgeon) Doctor, గల Well Settled వరుడికి తగిన వధువు కావలెను. 9246960888 | ★ పద్మశాలి: 30 Yrs, 5'2", MBBS, MD (Anesthesia), Doctor, 5Cr. ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888 |
| ★యాదవ్: 29Yrs, 6ft, MBBS, MD, Doctor గల వరుడికి తగిన వధువు కావలెను. 9248064777 | ★ముదిరాజ్ : 28 Yrs, 5'3", MBBS, PG (Dermatelogy), వధువుకి తగిన వరుడు కావలెను. 9010051444 |
| ★ మాల: 32 Yrs, 5'8", MBBS, MD & DM Doctor, 2LPM గల వరునికి తగిన వధువు కావలెను. 9030315599 | ★గౌడ: 32 Yrs, 5'5" MBBS, PG, Jr. Doctor, 2LPM గల Well Settled వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777 |
| ★రెడ్డి (2nd Match): 36Yrs, 6ft MBBS, MS, MCH (UK), Jr. Consultant, 25 Cr ప్రాపర్టీ గల వరునికి వధువు కావలెను. 9010051444 | ★మాల (హిందూ): 30 Yrs, 5'4", MBBS, MD Sr. Doctor, 1LPM గల వధువుకి తగిన వరుడు కావలెను. 9701960229 |

| వేదికలు | వధువు కావలెను |
| --- | --- |
| ★ఫ్రీ*: అన్ని కులముల/మొదటి/రెండవ/లేటు...వధువు*/వరుల వివాహ సంబంధములకై మీ ఫొటో, బయోడేటా, మా వాట్సాప్ నెంబరు (9291503949)కు పంపించగలరు. ''మా సేవ'' మ్యారేజ్ బ్యూరో (Since 1998) Ph: 9291503949 | ★CASTE NO BAR:46 Years, Divorced, 5'5", Finanacially Well Settled, Working in MNC, Monthly Salary Rs.1,50,000/- Looking Bride for Suitable decent Family. Direct: 9696756789 |
| 4 లైన్ల ప్రకటనకు 500/- (+ GST అదనం) ప్రతి అదనపు లైనుకు 125/- 9848077857 | ★ ఆర్య వైశ్య అబ్బాయి 36 M.Ed. ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 24 వేలు, ఆస్థి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు కు వ్రాయండి. |


## జనవరి 4, 9న రైతుల మహా పంచాయత్‌లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: రైతుల ఆందోళన, ఉద్యమానికి మరింత ఐక్యతను కూడగట్టడంపై చర్చించేందుకు పంజాబ్, హర్యానాలో జనవరిలో మహా పంచాయత్‌లు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) నిర్ణయించింది. జనవరి 4న పంజాబ్‌లోని తోహానాలో, జనవరి 9న హర్యానాలోని మోగాలో మహా పంచాయత్‌లు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. మహా పంచాయత్‌లో తాము పాల్గొనబోమని భారతీయ కిసాన్ యూనియన్(క్రాంతికారి) ప్రధాన కార్యదర్శి సుఖ్వీందర్ ప్రకటించారు. ఆందోళనలతో విసిగిపోయినందున కొన్ని సంఘాలు ఆసక్తి కోల్పోయాయని బీకేయూ(నాన్ పొలిటికల్) సభ్యుడు ధర్మేంద్ర మాలిక్ తెలిపారు.

## జనాలు చనిపోతే సినిమాపై ఏం మాట్లాడతాం

- సంధ్య థియేటర్ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'ఇక్కడ జనాలు చనిపోతే సినిమాల గురించి ఏం మాట్లాడతాం..' అంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంధ్య థియేటర్ ఘటనపై స్పందించారు. కడప జిల్లా పర్యటన అనంతరం మీడియాతో మాట్లాడుతుండగా సంధ్య థియేటర్ ఘటన, అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ 'ఇది సంబంధం లేని ప్రశ్న.. సినిమాల గురించి కాకుండా ప్రజా సమస్యలపై అడగండి..చర్చపెట్టండి' అని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం పవన్ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## 324 చ.కి.మీ.తో మూడో ముంబై

- రాయగఢ్‌లో నిర్మాణానికి రాష్ట్ర సర్కారు ప్రణాళిక

ముంబై, డిసెంబర్ 28 (నమస్తేతెలంగాణ): ముంబై, నవీ ముంబైని తలదన్నేలా మూడో ముంబై రూపుదిద్దుకోనున్నది. ఈ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. నవీ ముంబై సమీపంలోని రాయగఢ్‌లో 324 చదరపు కిలోమీటర్లలో ఈ నగరాన్ని నిర్మించనున్నామని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. 2025లో సర్వే ప్రారంభిస్తామని, సకల హంగులతో నిర్మించనున్న ఈ సిటీకి కర్నల్ సాయి చిర్నార్‌గా నామకరణం చేశామని పేర్కొన్నారు.

# తండ్రి ప్రతిరూపం సాక్షిగా కూతురు పెళ్లి..!

- రూ.4 లక్షలతో తండ్రి విగ్రహం తయారు చేయించిన కూతురు
- పెళ్లి జరుగుతున్నంతసేపూ మండపంపైనే ఉంచి మురిసిపోయిన బిడ్డ



కొత్తగూడెంలో తండ్రి విగ్రహంతో నూతన వధూవరులు

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 28 : తండ్రి ఈ లోకంలో లేకపోయినా.. ఆయన ప్రతిరూపం సాక్షిగా కూతురు పెళ్లి చేసుకున్న ఘటన కొత్తగూడెంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొత్తగూడెం హెడ్డాఫీస్ ఐటీ విభాగంలో డీజీఎంగా పని చేస్తున్న బాలరాజు 2019లో అనారోగ్యంతో మృతిచెందారు. అతడికి కుమారుడు, కూతురు ఉన్నారు. బాలరాజు ఉద్యోగాన్ని తన కూతురు స్నేహకు ఇచ్చారు. శుక్రవారం రాత్రి కొత్తగూడెంలోని కేసీవోఏ క్లబ్‌లో స్నేహ పెళ్లి సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో అండర్ మేనేజర్‌గా పనిచేస్తున్న అవినాష్‌తో జరిగింది. పెండ్లి కూతురు స్నేహ తన తండ్రి తమతో ఉండాలనే ఉద్దేశంతో రూ.4 లక్షలతో ఆయన విగ్రహాన్ని తయారు చేయించి వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి వివాహ వేడుక జరిగేంత వరకు మంటపంలో ఉంచింది. తండ్రి కళ్లముందే పెళ్లి జరుగుతున్నదని స్నేహ మురిసిపోయింది. అచ్చం మనిషిలా ఉండే ప్రతిమను తయారు చేయించి తీసుకురావడంతో అందరూ ఫొటోలు దిగారు. వారి బంధుమిత్రులు, సన్నిహితులు శనివారం స్నేహ ఇంటికి వెళ్లి విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోయారు.



## ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

- లక్ష టన్నుల ఎగుమతికి అంగీకారం
- జనవరి నెలాఖరుకు 40 వేల టన్నుల సరఫరా

హైదరాబాద్, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయం రంగంలో తీసుకొచ్చిన సంక్షేమ ఫలాలు దేశ ప్రజల ఆకలినే కాదు, విదేశీయుల ఆకలిని సైతం తీర్చుతున్నాయి. ఈ మేరకు తెలంగాణ బియ్యం ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి కానున్నాయి. ఇందుకు సంబంధించి పౌరసరఫరాల సంస్థతో ఫిలిప్పీన్స్‌కు లక్ష టన్నుల బియ్యం సరఫరాకు ఒప్పందం కుదుర్చుకున్నది. శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఆ దేశ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లక్ష టన్నుల బియ్యం సరఫరాకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా తొలి దశలో జనవరి నెలాఖరు నాటికి 40 వేల టన్నుల బియ్యం సరఫరా చేసేందుకు పౌరసరఫరాల సంస్థ చర్యలు చేపట్టింది. కొన్నేండ్లుగా రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి భారీగా పెరిగింది. 2014లో 70 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, ఇప్పుడు అది 2.5 కోట్ల టన్నులకు చేరింది. ఎఫ్‌సీఐకి సకాలంలో సీఎమ్మార్ ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో మిల్లుల్లో టన్నుల కొద్దీ ధాన్యం పేరుకుపోతున్నది. ఈ పరిస్థితుల్లో ఎఫ్‌సీఐకి ఇవ్వగా మిగిలిన బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు సివిల్ సప్లయ్ కొద్దిరోజులుగా కసరత్తు చేస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికే 38 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం ద్వారా విక్రయించగా, మిగిలిన ధాన్యాన్ని విదేశాలకు సరఫరా చేసి ఆదాయాన్ని సమకూర్చుకోవాలని భావిస్తున్నది.

## ఐదుగురు మావోయిస్టులు లొంగుబాటు

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 28 : నలుగురు ఏరియా కమిటీ సభ్యుల(ఏసీఎం)తోపాటు ఓ దళ సభ్యురాలు పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పెద్దగెల్లూరుకి చెందిన పూనెం పాక్లి, రాసపల్లికి చెందిన మడివి గంగి, ఇర్రపల్లికి చెందిన సోమా, భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఎర్రంపాడుకు చెందిన వెట్టి దేవ అలియాస్ బాలు, చెన్నాపురానికి చెందిన మడకం ఉంగి అలియాస్ గంగి లొంగిపోయారని తెలిపారు. మావోయిస్టులకు జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వ తరపున జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తున్నదని వెల్లడించారు.

## వీధి కుక్కల దాడిలలో చిన్నారికి గాయాలు

కృష్ణ, డిసెంబర్ 28 : పాఠశాలకు వెళ్తున్న విద్యార్థిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటుచేసుకున్నది. కృష్ణ మండలం హిందుపూర్‌లో 4వ తరగతి చదువుతున్న సమీనా శనివారం బడికి వెళ్తుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. స్థానికులు గమనించి గాయాలపాలైన సమీనాను జిల్లా కేంద్ర వైద్యశాలకు తరలించారు.

## ప్రభుత్వానికి సీతారామ టెండర్లు!

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులోని పలు ప్యాకేజీల టెండర్లపై నిర్ణయాన్ని ప్రభుత్వమే తీసుకోవాలని పంపాలని కమిషర్ ఆఫ్ టెండర్స్(సీవోటీ) నిర్ణయించింది. సాగునీటిపారుదలశాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో శనివారం సీవోటీ సమావేశం జరిగింది. సీతారామ ప్రాజెక్టు పెండింగ్ డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులు చేపట్టాలని గతంలోనే నిర్ణయించగా టెండర్లపై సీవోటీలో చర్చించారు. ఆమోదం కోసం టెండర్లను ప్రభుత్వానికే పంపించాలని సీవోటీ నిర్ణయించింది. మరిన్ని ప్రాజెక్టుల టెండర్లపైనా చర్చించి, వాటిని కూడా ప్రభుత్వానికే పంపాలని నిర్ణయించినట్టు తెలిసింది.

## భద్రకాళి చెరువు పూడికతీతకు మార్గదర్శకాలు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): వరంగల్ భద్రకాళి చెరువులో పూడికతీతకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు సాగునీటిశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. చెరువులో రూ.11.16కోట్లతో పూడికతీత, తరలింపు, సమాచార నిర్వహణ బాధ్యతను వరంగల్ సీఈకి అప్పగించింది. రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని పనులను నిర్వహించాలని ఆదేశించింది. పూడికతీత ఫొటోలు, వీడియోలు తీయాలని సూచించింది.

## ఆప్ కట్టడికి కాంగ్రెస్, బీజేపీ పన్నాగం

- కేజ్రీవాల్ ఆరోపణ



న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రంగా మండిపడ్డారు. ఆప్ ప్రతిపాదిత సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ ఫిర్యాదుపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ దర్యాప్తునకు ఆదేశించిన నేపథ్యంలో కేజ్రీవాల్ ఘాటుగా స్పందించారు. విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఢిల్లీ శాసన సభ ఎన్నికలకు ముందు మహిళలు, వృద్ధుల కోసం ఆప్ ప్రతిపాదించిన మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలను ఆపడానికి కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. మహిళా సమ్మాన్ యోజన పేరుతో మహిళల వ్యక్తిగత వివరాలను ప్రైవేట్ వ్యక్తులు సేకరిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా దర్యాప్తునకు ఆదేశించడంపై కేజ్రీవాల్ ఈ విధంగా స్పందించారు.